కేంద్ర మంత్రులను కలిసిన శ్రీనివాస్‌రెడ్డి



బండి సంజయ్, కిషన్ రెడ్డిని సన్మానిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్ర నగర్ నియోజకవర్గం బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డిలను సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశ హ్యాట్రిక్ ప్రధాన మంత్రిగా నరేంద్రమోది ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఢిల్లీకి వెళ్లిన నేపథ్యంలో వారిని కలిసినట్లు తెలిపారు. దేశాభివృద్ధిలో భాగంగా తెలంగాణ నుండి ఇద్దరికి కేంద్రంలో మంత్రులుగా చోటు దక్కడం పట్ల శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం

నార్సింగి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్


పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ కల్పించి వాటిని నందన వనాలుగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ ఛైర్మెన్ జి.విజయ్‌బాబు అన్నారు. మరో రెండు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు తెరచుకోనుండటంతో వాటిని శుభ్రపరచటం, విద్యార్థులకు అనుకూలంగా సిద్ధం చేసే పారిశుద్ధ్య పనులను నార్సింగి ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. రెండు రోజుల్లో అన్ని పాఠశాలల్లో మంచినీటి ట్యాంకులు, మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తామన్నారు. ఉచిత పుస్తకాలు, డ్రస్‌లు, ఉన్నత విద్యావంతులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనాలను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్‌లు లక్ష్మీప్రవళిక కిరణ్, పత్తి ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, నాయకులు రాము, వినోద్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలోని సరస్వతీమాత విగ్రహానికి పూజలు నిర్వహించారు.

బ్యూటీ పార్లర్ కోర్సులో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: ముచ్చింతల్ శివారులోని స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో బ్యూటీ ప్యార్లర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 12 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్ల వయసున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 30 రోజుల పాటు జరిగే శిక్షణలో ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు.

చెత్త వాహనాల్లోనే వ్యర్థాలు వేయాలి

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమిషనర్


చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇంటింటి చెత్త సేకరణకు వెళ్లే స్వచ్ఛ ఆటో కార్మికులు తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 10,11,12 డివిజన్లలో ఇంటింటి చెత్త సేకరణ పనులను సోమవారం పర్యవేక్షించారు. కార్మికులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వ్యర్థాలను చెత్త సేకరణ కార్మికులకు మాత్రమే దించాలన్నారు. రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దన్నారు. రోడ్లపై చెత్త వేయడం వల్ల పరిసరాలు దుర్గంధభరితంగా తయారవుతాయన్నారు. దీనివల్ల రోగాలు వ్యాప్తి చెందుతాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు తౌఫిక్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో అప్రమత్తత అవసరం

శంషాబాద్ పీఏసీఎస్ ఛైర్మన్ ముద్దం మల్లారెడ్డి


పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ ఛైర్మన్ ముద్దం మల్లారెడ్డి

శంషాబాద్: నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని శంషాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ ముద్దం మల్లారెడ్డి సూచించారు. సోమవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు...రైతులు ఇప్పటికే పొలాలను దుక్కిదున్ని సిద్ధం చేసుకోవడంతో పాటు, విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. ఈ ఏడు వర్షాలు సమృద్ధిగా ఉండడం శుభసూచకమన్నారు. వ్యవయసాయాధికారుల సూచనల మేరకు రైతులు పంటల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అన్నదాతల అవసరాలకు అనుగుణంగా రుణాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కర్ణం జ్ఞానేశ్వర్ యాదవ్, పాలకవర్గం సభ్యులు రంగారెడ్డి కరుణాకర్‌రెడ్డి, మైలారం సులోచన, గుర్రంపల్లి శ్రీనివాస్, అరుంధతి, సత్తయ్య, కొత్త పోచయ్య, సంఘం సీఈఓ అర్జున్, సిబ్బంది మోహన్, ఫిలోమెన్‌రాజు, రాంరెడ్డి, సదాశివరెడ్డి, వెంకటేశ్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

పాఠశాలలు ప్రారంభం నాటికి 'అమ్మ ఆదర్శ'


పాఠశాలలను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి రామిరెడ్డి, తదితరులు

అత్తాపూర్: పాఠశాలలు ప్రారంభం నాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి డి.రామిరెడ్డి మండల నోడల్ అధికారి శివరాంపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ నాయక్ అన్నారు. నూతన విద్యా సంవత్సరం బుధవారం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పట్టణ పరిధిలోని పాఠశాల అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. సమిష్ట కృషితో ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉంటుందని కోరారు. పద్మశాలి పురం, గణేష్‌నగర్, బుద్వేల్ అసన్ నగర్ చింతల్‌మెట్ బాంబే కాలనీ లక్ష్మీగూడ, వాంబే కాలనీ మధుబన్ బుద్వేల్ భవానీ కాలనీ, శివరాంపల్లి అత్తాపూర్ హైదర్‌గూడ దగ్గర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 90 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు.

బడిబాటలో ఉపాధ్యాయులు

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు అందించడంతో పాటు శిక్షణ పొందిన ఉపాధ్యాయుల చేత ఉత్తమ విద్యను అందించేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని, బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా హైదర్‌గూడలోని పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయులతో కలిసి విద్యాశాఖ అందించిన కరపత్రాలను ఇంటింటా పంచి పెడుతూ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్న దృఢసంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఉపాధ్యాయురాలు ఉమాదేవి, ఇందిరా, శివ, సత్యనారాయణ పాల్గొన్నారు.


పెద్దషాపూర్‌లో బడిబాటలో ఉపాధ్యాయులు

శంషాబాద్ రూరల్: బడిబాటలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీలో చదువు పూర్తి చేసుకున్న వారిని సమీప ప్రభుత్వ బడుల్లో, ప్రాథమిక విద్యను పూర్తి చేసిన విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నారు.

పాఠశాలకు పచ్చని సొబగులు..

- పచ్చదనం.. పరిశుభ్రతలో మేటిగా
- తీర్చిదిద్దుతున్న హుడా కాలనీ ప్రధానోపాధ్యాయుడు
- ఎనిమిదేళ్ల కృషి ఫలితం, పలు అవార్డులతో గుర్తింపు

విద్యార్థులను ఆకర్షిస్తోన్న సర్కారు బడి


పాటశాల నిండా పచ్చదనం

శంషాబాద్: పట్టణంలోని హుడా కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారైంది. పచ్చదనం.. పరిశుభ్రతతో పాటు చక్కని విద్యాబోధనకు నిలయంగా మారింది. ఇటీవల కొత్త రంగులతో మరింత సోబను సంతరించుకుంది. ఇదే పాఠశాలలో పదేళ్ల కిందట శిథిలావస్థలో ఉన్న గదిలో మాత్రమే ఉండేది. విశ్రాంత సైనికుడు జనార్ధన్ పోరాటంతో పదేళ్ల కిందటే పాఠశాలకు జీప్లస్ వన్ అంతస్తులతో భవనాన్ని నిర్మించారు. ఎనిమిదేళ్ల కిందట ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వచ్చిన మల్లేష్ అనేక మంది దాతల సహకారంతో పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేయించారు. దీంతో పాటు మరుగుదొడ్లు, బెంచీలు, మంచినీరు ఇలా అన్ని హంగులనూ ఏర్పాటు చేయించుకున్నారు. దీనికి తోడు ప్రభుత్వ నిధులు రావడంతో మరింతగా అభివృద్ధి చేశారు. దీంతో మండలంలోనే అంత్యంత పరిశుభ్రతతోనూ, పచ్చదనం ఉన్న పాఠశాలగా గుర్తింపు పొందుతోంది.

ఐదో తరగతి వరకూ..

ప్రస్తుతం ఇందులో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ విద్యాబోధన ఉంది. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా మరో ఉపాధ్యాయురాలు, వాలంటీర్లను ఏర్పాటు చేసుకున్నారు. సుమారు వందకు పైగా అంత్యంత నిరుపేద వలసకార్మికుల పిల్లలు ఇందులో విద్యనభ్యసిస్తున్నారు.

అనేక అవార్డులు..

పచ్చదనం, పరిశుభ్రతతో పాటు అన్ని హంగులతో తీర్చిదిద్దిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేష్ ఇప్పటికే జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులను పొందారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు అనేక మంది ప్రజాప్రతినిధులు పాఠశాల కోసం ఆయన చేస్తున్న కృషిని అభినందిస్తున్నారు.


హుడా కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

అందరి సహకారంతో..

ఉన్నతాధికారులు సహకారంతో పాటు అనేక మంది దాతల సహకారంతో పాఠశాలను అన్ని హంగులతో తీర్చిదిద్దాం.. ప్రయివేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా హుడా బడి అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది. చదువుల కోసం విద్యార్థులను రా రమ్మని పిలుస్తోంది. ఈ బడిని స్థానికులు మరింతగా సద్వినియోగం చేసుకోవాలి కోరుతున్నాం.
– మల్లేష్, హుడా కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

పూడికతీత పనులు పరిశీలన

బండ్లగూడ: ఎర్రకుంట పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో పది రోజులుగా జరుగుతున్న ఎర్రకుంట పూడికతీత పనులను, ఎర్రకుంట కట్టకు సపోర్టుగా నిర్మించనున్న కాంపౌండ్ వాల్ బెస్మెంట్ పనులను సోమవారం కమిషనర్ శరత్‌చంద్రతో కలిసి పరిశీలించారు. నిరంతరాయంగా ఎర్రకుంటను పూడికతీయిస్తూ ఈ వర్షాకాలంలో కుంట నిండే ఏర్పాట్లు చేయిస్తున్నాం, కుంట నిండితే వచ్చే ఏడాది వరకూ నీటి ఎద్దడి ఉండదని భావిస్తున్నామన్నారు. సీనియర్ నాయకులు టింకురెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోష్‌ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు రవికాంత్‌రెడ్డి, కాంట్రాక్టర్ రామ్‌రెడ్డి, లక్ష్మినగర్ కాలనీ అధ్యక్షులు, భాగ్యనగర్ కాలనీ అధ్యక్షులు పాల్గొన్నారు.

వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పరిష్కరిస్తాం



రాజేంద్రనగర్: ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని సోమవారం వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులకు నేరుగా అక్కడే అందజేసి, రికార్డుల్లో నమోదు చేసి పరిష్కరిస్తామన్నారు.

రోడ్లకు ప్యాచ్‌వర్క్స్


బండ్లగూడ రోడ్డులో ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: గోతులమయమైన రోడ్లకు మరమ్మతు పనులు చేయిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. వర్షాలకు ఏర్పడ్డ గోతులను పూడ్చేందుకు బిటీ మిశ్ర మాన్ని తెప్పించి ప్యాచ్ వర్క్ పనులను చేపట్టారు. రేడియల్ రోడ్డు, కిస్మత్‌పూర్ నుంచి బండ్లగూడకు వెళ్లే మార్గంలో ఏర్పడ్డ గోతులను పూడ్చారు. గొతులమయమైన రోడ్ల కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బీటీ మిశ్రమంతో పూడుస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తేవాలన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని కాలనీలనూ అభివృద్ధి చేస్తానని కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. శ్రీ వెంకటేశ్వ కాలనీ సభ్యులు నూతన మేయర్ లతాప్రేమ్‌గౌడ్‌ను సోమవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని, కరెంటు, మంచినీటి, డ్రైనేజీ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని లతా హామీ ఇచ్చారు. కాలనీ వాసులు దుగ్గంపూడి వసంత, అమరేశ్వరి, కాసుల లావణ్య, సూర్య, సుష్య, నాగుల జంగయ్య, కావలి పాండు, ప్రభాకర్‌గౌడ్, వెన్నెల నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

సేవలు ప్రజలకు ఉపయోగపడాలి


ఉచిత పరీక్షలకు పేర్లు నమోదు చేసుకున్న ప్రజలు


రక్తదానం చేసిన వారికి మొమెంటోలను అందించిన నాయకులు

మణికొండ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్

మణికొండ: జన్మదినోత్సవాల పేరుతో అనవసరమైన కార్యక్రమాలు నిర్వహించకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. జితేందర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కస్తూరి సతీష్‌కుమార్‌లు కోరారు. సోమవారం మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె నరేందర్ ముదిరాజ్, అతని సోదరుడు కె.రాములు ముదిరాజ్‌ల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పుప్పాలగూడ చింతచెట్టు సర్కిల్లో శివ సూపర్ మార్కెట్ తరపున ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్‌క్యాంప్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిభిరాలతో వేలాది మందికి మేలు జరుగుతుందన్నారు. కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలనూ నిర్వహించి ఉచితంగా మందులు అందించారన్నారు. పలువురు రక్తదానం చేశారు. మున్సిపల్ చైర్మెన్ నరేందర్‌కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, నాయకులు మల్లేష్, ప్రభావతిలతో పాటు వందలాది మంది పాల్గొన్నారు.


భవన నిర్మాణ పనుల పరిశీలన

- వేగవంతంగా జరిగేలా చూడాలి
- అధికారులు, కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశం


భవన నిర్మాణం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న మున్సిపాలిటీ కార్యాలయ భవనంతో పాటు 14వ వార్డులో నిర్మాణంలోని మినీ ఫంక్షన్ హాలు పనులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుష్మ, వైస్‌ఛైర్మన్ బండి గోపాల్ యాదవ్‌లతో కలిసి పరిశీలించారు. మున్సిపాలిటీ నూతన కార్యాలంయంతో పాటు మినీ ఫంక్షన్ హాలు పనులు వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పౌరసేవలు అందించేందుకు నూతన భవనం విశాలంగా నిర్మిస్తున్నామన్నారు. మినీ ఫంక్షన్ హాలును సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తెస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బి సుమన్‌రావు, కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్, మేకల వెంకటేష్, భారతమ్మ, పుష్పలత బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు డి.వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మెన్, కౌన్సిలర్‌లను సన్మానిస్తున్న దళిత సంఘం నాయకులు

నార్సింగి మున్సిపల్ ఛైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, దీంతోపాటు అన్ని వార్డులనూ అభివృద్ధి చేస్తామని నార్సింగి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ ఎం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ ఛైర్మెన్ జి. విజయ్‌బాబు అన్నారు. కోకాపేట దళిత సంఘం, యాదవ సంఘాల ఆధ్వర్యంలో నైతన ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మెన్‌లుగా ఎన్నికైన వారిని సన్మానించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోని సమస్యలపై తమకు అవగాహన ఉందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయని, మంగళవారం జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, ఎ.దుర్గేష్‌యాదవ్, లక్ష్మీప్రవళిక కిరణ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, గోపాల గణేష్, ఆర్ యాదగిరి, ఉపేందర్, శిరీష్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు నార్సింగి మున్సిపల్ సమావేశం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పాలకవర్గం సర్వసభ్య సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు కమిషనర్ టి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపాలిటీ పరిధిలోని జలమండలి, విద్యుత్, పోలీస్, వైద్యం, ఆర్టీసీ, రోడ్లు, భవనాలు, పశువైద్యం తదితర శాఖల అధికారులంతా పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.

ది సిటిజన్ కౌన్సిల్ ప్రారంభం


ది సిటిజన్ కౌన్సిల్‌ను ప్రారంభిస్తున్న కార్యవర్గ సభ్యులు

మణికొండ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు కనీస అవసరాల పట్ల అవగాహన కల్పించి మెరుగైన సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా ది సిటిజన్ కౌన్సిల్ ప్రారంభించామని అధ్యక్షుడు డి సీతారాం తెలిపారు. ప్రజలందరికీ విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, విద్యుత్, మురుగునీటి వ్యవస్థ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంస్థల పనితీరు పారదర్శకంగా సుపరిపాలన అందించేలా ఈ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఎన్నికల ప్రక్రియ పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తామని, కుల, మతాలకు అతీతంగా సమసమాజ స్థాపనకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బోధనలకు అనుగుణంగా కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సంస్థలో చేరవచ్చన్నారు. ప్రధాన కార్యదర్శిగా షేక్ ఆరిఫ్ మహమ్మద్, ఉపాధ్యక్షునిగా అందె లక్ష్మణరావు, ఉప కార్యదర్శిగా ఉపేందర్‌నాథ్‌రెడ్డి, కోశాధికారి దిపిల్, కార్యనిర్వాహక సభ్యులుగా రామసుబ్బారెడ్డి, విద్యాసాగర్‌లు పనిచేస్తారని తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్

శంషాబాద్: పట్టణంలోని కొత్వాల్‌గూడ వాసి అయిన కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు గుంటి ప్రవీణ్‌కుమార్ (మిట్టు) పుట్టిన రోజు సందర్భంగా పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. పట్టణంలోని చైతన్యమహిళా మండలి కార్యాలయంలో విద్యార్థులకు వితరణం పుస్తకాలను అందజేశారు. అనంతరం పట్టణంలోని ఫ్లైఓవర్, ఆస్పత్రి తదితర ప్రాంతాల నివాసముంటున్న నిరాశ్రయులకు పండ్లు పంపిణీ చేశారు. మహ్మద్ నజీరుద్దీన్, మధుపాల్, జి.పి పాల్సన్, సంజీవరెడ్డి, ప్రకాష్, చిరంజీవి, ప్రభాకర్, కాజాపాషా, నజీముద్దిన్, శ్రీనివాస్ యాదవ్, సురేష్, సంతోష్ కుమార్, నర్సింహ పాల్గొన్నారు.

హైస్కూళ్లలో వసతులు కరువు


జూకల్ ప్రాథమికోన్నత పాఠశాలలో కిటికీలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: మండల పరిధిలో మన ఊరు– మన బడి కార్యక్రమంలో ఎంపికైన పాఠశాలల్లో కొన్ని చోట్ల పనులు చేపట్టలేదు. ముఖ్యంగా జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనులు చేయక పోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. మౌలిక వసతులు, నీటి సౌకర్యం ప్రధానంగా కల్పించాలి. నర్కూడ, పాల్మాకుల జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఈ పనులు చేపట్టలేదు. మరో వైపు కొత్తగా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో ఎంపిక చేసిన వాటికి లక్ష చొప్పున నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో మరుగుదొడ్లు, నీటి సౌకర్యంతో పాటు తరగతి గదుల్లో కరెంటు, ఫ్యాను సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేకాకుండా తలుపులు, కిటకీలు, ఇతర మరమ్మతులు చేస్తున్నారు.

మౌలిక సమస్యలపై వినతి పత్రం


సుమన్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

శంషాబాద్: మౌలిక వసతులు కల్పించాలని మున్సిపాలిటీలోని ఒకటో వార్డు సాయినగర్ కాలనీ వాసులు కమిషనర్ బి సుమన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల తమ కాలనీలోని ప్రధాన రహదారి గుండా మురుగునీరు పోయేలా తీసిన కాల్వను వెంటనే మూసి వేయాలని కోరారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగునీటి ప్రవాహం పక్కనే ఉన్న గేటెడ్ కమ్యూనిటీ నుంచి వెళ్లాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగా తమ కాలనీ వైపుకు మార్చారన్నారు. దీంతో వర్షాకాలంలో రాకపోకలు సాగించలేదని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కాలనీకి సీసీ రహదారి, అంతర్గత డ్రైయినేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీ అధ్యక్షుడు రాచమల్ల రమేష్, ఉపాధ్యక్షుడు సుందర్, ప్రధాన కార్యదర్శి తలారి వెంకటయ్య, సంజయ్, రాజిరెడ్డి, శ్రీనివాస్, బాల్‌రాజ్, సుమన్, రమేష్ ఉన్నారు.

మినీ బస్సు ఢీకొని విద్యార్థిని మృతి

అత్తాపూర్: ద్విచక్రవాహనాన్ని మినీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన అత్తాపూర్ పిఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి వెంకటరామిరెడ్డి వివరాల ప్రకారం.. చంద్రాయన్‌గుట్ట అసమాబాద్‌కు చెందిన ఓ విద్యార్థిని(18) పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 210 వద్ద జిమ్ చేసేందుకు ద్విచక్రవాహనంపై వస్తుంది. రోజు మాదిరిగానే జిమ్ చేసి ఇంటికి వెళ్లే క్రమంలో ఆరంగల్ చౌరస్తా సమీపంలో గుర్తుతెలియని మినీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న అత్తాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. సీసీ కెమెరాల పుటేజీల సాయంతో మినీ బస్సును గుర్తిస్తామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి ..


మృతి చెందిన పాండు

అత్తాపూర్: రోడ్డు ప్రమాదంలో ఓ చిరువ్యాపారి మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి. వెంకటరామిరెడ్డి రాజేంద్రనగర్ ఆర్టీసీ అధికారులు బస్ కండక్టర్ శివానంద్ వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ డిపోకు చెందిన (ఏపీ29జెడ్232) వాహనం కోటీ నుంచి రాజేంద్రనగర్ వయా చింతల్‌మెట్ కిషన్ బాబుల మీదుగా ప్రయాణిస్తుంది. చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన పాండు(56) కూరగాయలు, పండ్లు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలానే చింతల్ మెట్ వైపు ఆటోలో పాండు హనుమాన్ టెంపుల్ సమీపంలో ప్రమాదవశాత్తు బస్సుకింద పడిపోయాడు. డ్రైవర్ బ్రేక్ వేసినా లాభం లేకపోయింది. తలకు తీవ్ర గాయాలతో పాండు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.